సాక్షి శ్రీకాకుళం

ఆదివారం । 1 । జూన్ । 2025



అమ్మో..జూన్

జూన్ భయపెడుతోంది. ఓ వైపు స్కూలు ఖర్చులు, మరోవైపు ఖరీఫ్ ఖర్చులు కలిపి తడిసి మోపెడవుతున్నాయి. - 8లో



సంబరాలకు వేళాయె

కంచిలిలో నేటి నుంచి కంచమ్మ తల్లి ఉత్సవాలు జరగనున్నాయి. ఏర్పాట్లు పూర్తి చేశారు. - 8లో

నేడు విశాఖ-గుణుపూర్ రైలు రద్దు

పాతపట్నం: విశాఖపట్నం–గుణుపూర్ విశాఖ పాసింజర్ రైలు జూన్ 1వ తేదీన రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు శనివారం తెలిపారు. నెల్లిమెర్ల, గరివిడి, విజయనగరం రైల్వే స్టేషన్ పరిధిలో అభివృద్ధి పనుల నిమిత్తం విశాఖ పాసింజర్ రైలు రద్దు చేశామని, ప్రయాణికులు గమనించాలని రైల్వే అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

కేశవరావు పెద్ద కర్మపై ఆంక్షలు సరికాదు

టెక్కలి: మావోయిస్టు అగ్రనేత నంబాల కేశవరావు పెద్దకర్మ కార్యక్రమంపై పోలీసులు ఆంక్షలు విధించడం సరికాదంటూ సీపీఐ ఎంఎల్ న్యూ డెమొక్రసీ రాష్ట్ర నాయకులు పి.ప్రసాద్, చిట్టిపాటి వెంకటేశ్వర్లు శనివారం ఓ ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. మృతదేహాన్ని అప్పగించకుండా ఆంక్షలతో అడ్డుకున్నారని, ఇప్పుడు కుటుంబ సభ్యులు చేపట్టనున్న పెద్ద కర్మ కార్యక్రమం పై పోలీసులు లేని పోని ఆంక్షలు విధించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని పేర్కొన్నారు. ఎలాంటి సంతాప సభలు లేకుండా కేవలం కుటుంబ సభ్యులు చేస్తున్న కార్యక్రమానికి ఈ విధంగా అడ్డుకోవడం మంచిది కాదన్నారు. దీన్ని వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలతో పాటు ప్రజాస్వామికవాదులు ఖండించాలని వారు విజ్ఞప్తి చేశారు.

ఉద్దానంలో కార్గో విధ్వంసం వద్దు



కార్గో ఎయిర్ పోర్టు వ్యతిరేక కళాజాత ప్రదర్శన

మందస: మందస మండలం బిడిమి గ్రామంలో కార్గో ఎయిర్ పోర్ట్ వ్యతిరేక పోరాట కమిటీ అధ్యక్షుడు కోమర వాసు పిలుపు మేరకు ప్రజా కళా మండలి అధ్యక్షుడు కొర్రాయి నీలకంఠం, రంగం కళాకారుడు కొనారి సూధన్ ఆధ్వర్యంలో శనివారం కళాజాత కార్యక్రమం నిర్వహించారు. పచ్చని ఉద్దానంలో విధ్వంసకర ఎయిర్ పోర్టు నిర్మాణాలు చేపట్టవద్దని విజ్ఞప్తి చేశారు. రాంపురం, భేతాళపురం, చీపురుపల్లి గ్రామాల ప్రజలు వీరికి సంఘీభావం తెలిపారు. ఏ అభివృద్ధి పనులైనా ప్రజలకు ప్రయోజనం కలిగించాలని, వారి ఆమోదం ఉండాలని సీపీఎం కార్యదర్శి డి.గోవిందు, జిల్లా కార్యదర్శి తాండ ప్రకాశ్, కొర్లా హేమారావు, తెప్పల అజయ్ తెలిపారు. భాగంగా జుత్తు గున్నయ్య, తెప్పల గున్నయ్య, దున్న హరికృష్ణ, రాములమ్మ, కృష్ణారావు, ఉద్యానవనం యూనివర్సిటి బోర్డు మెంబర్ బత్తిని లక్ష్మణరావు, నారాయణ, గ్రామ పెద్దలు యువత పాల్గొన్నారు.

పీఎస్‌హెచ్‌ఎంల వెబ్ ఆప్షన్‌కు మరో రోజు గడువు పెంపు

శ్రీకాకుళం న్యూకాలనీ: ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంల వెబ్ ఆప్షన్‌కు ప్రభుత్వం మరో రోజు గడువు పెంచింది. ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక విజ్ఞప్తి మేరకు పాఠశాల విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించి వెబ్‌ఆప్షన్ల నమోదు చేసుకునేందుకు ఆదివారం సాయంత్రం వరకు గడువు పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు.

నేత్రపర్వంగా మల్లన్న వార్షిక కల్యాణం



వార్షిక కల్యాణంలో ఉత్సవ మూర్తులు

టెక్కలి: టెక్కలి మండలం రావివలస గ్రామంలో గల ఎండల మల్లికార్జునస్వామి దేవస్థానంలో శనివారం స్వామి వారి వార్షిక కల్యాణాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. కార్యనిర్వహణాధికారి జి.గురునాధరావు ఆధ్వర్యంలో అర్చకులు రామకృష్ణ, మోహన్ రావు, యుగంధర్ తదితరులు భ్రమరాంబ సమేత మల్లన్నకు కల్యాణం నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఎల్.ఎల్.నాయుడు, బి.జగదీశ్వర్రావు, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ఏడాదిలో హామీలే మిగిలాయి

- వెన్నుపోటు పొడవడంలో బాబుకు ఎవరూ సాటిరారు
- బాబుకు ఓటేసినందుకు జనం నోట్లో మట్టి కొట్టారు
- జూన్ 4న వెన్నుపోటు దినం
- పోస్టర్ ఆవిష్కరణలో ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ శ్రీకాకుళం పార్లమెంట్ పరిశీలకుడు కుంభా రవిబాబు



పోస్టర్ విడుదల చేస్తున్న పార్టీ నేతలు కుంభా రవిబాబు, ధర్మాన కృష్ణదాస్, పేరాడ తిలక్, గొర్లె కిరణ్‌కుమార్, చింతాడ రవికుమార్, కిల్లి సత్యనారాయణ, మామిడి శ్రీకాంత్, ఎంవీ స్వరూప్ తదితరులు

శ్రీకాకుళం రూరల్:

కూటమి అధికారంలోకి వచ్చిన ఏడాదిలో హామీలే మిగిలాయని ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ శ్రీకాకుళం పార్లమెంట్ పరిశీలకుడు కుంభా రవిబాబు తెలిపారు. జూన్ 4న నిర్వహించనున్న వెన్నుపోటు దినం పోస్టర్‌ను శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ అధినేత వైఎస్ జగన్ ఇచ్చిన పిలుపుతో వెన్నుపోటు దినోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. చంద్రబాబు రాజకీయ జీవితం వెన్నుపోటుతోనే మొదలైందన్నారు. వెన్నుపోటు పొడవడంలో ఆయనకు ఎవరూ సాటిలేరని చురకలు అంటించారు. సాధ్యం కాని హామీలు ఇచ్చి ఇప్పటికీ వాటిని అమలు చేయలేదన్నారు. చంద్రబాబు ఇచ్చిన హామీలు నెరవేర్చాలంటే సంవత్సరానికి లక్షా 25వేల కోట్లు బడ్జెట్ అవసరమన్నారు. 25 లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగులకు రూ.3వేలు, రాష్ట్రవ్యాప్తంగా బడికి వెళ్లే 40లక్షల మంది పిల్లలకు రూ.15వేలు ఇస్తామంటూ ఇచ్చిన మాటలన్నీ మర్చిపోయారని అన్నారు. మహిళలకు ఉచిత బస్సు ఊసే లేదని గుర్తు చేశారు. రైతు భరోసా కూడా ఇవ్వలేదన్నారు. 50 ఏళ్లకు పెన్షన్, సబ్‌ప్లాన్ నిధులు, సంపద సృష్టి అంతా బూటకమేనని విమర్శించారు. జిల్లాకు చెందిన కేంద్రమంత్రి, రాష్ట్రమంత్రి కలిసి పోలవరం ప్రాజెక్టు ఎత్తు తగ్గించడానికి ఎలా సంతకాలు పెట్టారని ప్రశ్నించారు. దీనివల్ల ఉత్తరాంధ్ర రైతుల ఆశలు అడియాసలయ్యాయని అన్నారు. వీటిపై ప్రజలను చైతన్యవంతులు చేసేందుకే జూన్ 4న వెన్నుపోటు దినం నిర్వహిస్తున్నట్లు వివరించారు.

పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ మాట్లాడుతూ చంద్రబాబు ఇచ్చిన మోసపూరిత హామీలపైనే ఈ నెల 4న జిల్లా వ్యాప్తంగా వెన్నుపోటు దినాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ ఎచ్చెర్ల, ఆమదాలవలస సమన్వయకర్తలు గొర్లె కిరణ్‌కుమార్, చింతాడ రవికుమార్, రాష్ట్ర పార్టీ కార్యదర్శి కేవీ సత్యనారాయణ, పార్టీ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మెంటాడ స్వరూప్, పార్టీ తూర్పు కాపు కుల విభాగ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి శ్రీకాంత్, జిల్లా పార్టీ కార్యదర్శి గేదెల పురుషోత్తం, పార్టీ సీనియర్ నాయకులు గొండు కృష్ణమూర్తి, అంబటి శ్రీనివాసరావు, మూకళ్ల తాతబాబు, రౌతు శంకరావు, కామేశ్వరి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

కనిపింఛన్ చిత్రాలెన్నో..



- పింఛన్లపై సర్కారు గొప్పలు
- క్షేత్రస్థాయిలో మాత్రం గగ్గోలు పెడుతున్న లబ్ధిదారులు
- నిబంధనల పేరుతో లబ్ధిదారుల కుదింపు
- 50 ఏళ్లకే పెన్షన్ హామీ గాలికి
- వితంతు పింఛన్ల మంజూరులో పీటముడులు
- కొత్తగా మంజూరు కాని పింఛన్లు



ఏడాది పాలన
ఇదేనా బాబూ..



ఓ వితంతువు: అయ్యా నేను వితంతువును.. పింఛన్ ఇస్తారా..?
సర్కారు : నీ భర్త పింఛన్ లబ్ధిదారుడు అయి ఉంటేనే.. నువ్వు అర్హురాలివి. లేకుంటే నీకు అర్హత ఉండదు.
ఓ అర్హుడు : అయ్యా.. నాకు 50 ఏళ్లు దాటాయి.. పెన్షన్ ఇస్తా అన్నారు.. మంజూరు చేస్తారా..?
సర్కారు : యాభై ఇప్పుడే దాటాయి కదా.. అప్పుడే తొందరేంటి. మరికొన్నాళ్లు పోనీ.
ఓ దివ్యాంగుడు : స్వామీ.. నాకు వైకల్యం ఉంది.. సర్టిఫికెట్ ఉన్నా.. పెన్షన్ ఆపేశారు..?
సర్కారు : ఉందని నువ్వు చెబితే కుదరదు. పాత సర్టిఫికెట్ చెల్లదు. ఆస్పత్రికి వెళ్లి.. రోజంతా ఉండి.. డాక్టర్‌ను సంప్రదించి కొత్త పత్రం తీసుకువస్తేనే పని జరుగుతుంది.
60 ఏళ్లు దాటిన వ్యక్తి : అయ్యా.. నాకు 60 దాటాయి. పెన్షన్ ఇవ్వగలరా..?
సర్కారు : మేమొచ్చి ఏడాదే కదా అయ్యింది. కొన్నాళ్లయ్యాక ఇస్తాం..

పింఛన్లపై ప్రభుత్వ పెద్దలు కొడుతున్న డప్పుల వెనుక ఇన్ని తిప్పలు దాగున్నాయి. పింఛన్ మొత్తాన్ని పెంచినట్టే పెంచి లబ్ధిదారుల సంఖ్యను కుదించేశారు. 50 ఏళ్లకే పెన్షన్ ఇస్తామని ఊరూరా తిరిగి చెప్పి ఇప్పుడు దానిపై నోరు విప్పడం లేదు. కనిపించని ఈ కారణాలు ఎన్నో కుటుంబాల కన్నీళ్లకు ఆనవాళ్లు.

ఆమదాలవలస:

'మేం పింఛన్ మొత్తాన్ని పెంచాం. గతం కంటే ఎక్కువ డబ్బు ఇస్తున్నాం' ఏడాది కాలంగా అధికార పక్ష నేతలు చెబుతున్న మాటలివి. కానీ లబ్ధిదారుల సంఖ్య తగ్గిపోయిందని గానీ, 50 ఏళ్ల పెన్షన్ హామీ మూలన పడిందని గానీ, వితంతు పెన్షన్ల మంజూరులో లొసుగులు ఉన్నాయని గానీ ఎవరూ మాట్లాడడం లేదు. టీడీపీకే సాధ్యమైన పని తక్కువ.. ప్రచారం ఎక్కువ కాన్సెప్టుకు పింఛన్ల వ్యవహారమే ప్రత్యక్ష నిదర్శనం.

50 ఏళ్లు నిండిన వారి మాట అటుంచితే 60 ఏళ్లు దాటిన వ్యక్తులకు కూడా పింఛన్లు ఇవ్వలేదు. జిల్లా వ్యాప్తంగా 50 ఏళ్లు నిండిన వారు వేల సంఖ్యలో ఉండగా, 60 ఏళ్లు నిండి పింఛన్‌కు దరఖాస్తు చేసుకున్న వారి సంఖ్య దాదాపు 36,130 ఉంది. ఏడాది పాలనలో వీరిలో ఒక్కరికి కూడా పింఛన్ మంజూరు చేయలేదు. గ్రామాల్లో ఉన్న పెన్షన్‌లను తొలగించేస్తుండడంతో కొత్త పెన్షన్లపై ఎవరూ నోరు మెదపడం లేదు.


గతంలో ఇలా..



భువనేశ్వర్ వెళ్ల గొర్రెల చిన్నమ్మడుకు పింఛన్ అందిస్తున్న నరసమ్మ

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రతి నెలా ఖరున కొత్త పెన్షన్‌ల మంజూరుకు ప్రతి గ్రామం, వార్డులనుంచి వలంటీర్లు దరఖాస్తులు సచివాలయాలకు తీసుకువెళ్లేవారు. కొత్తగా పెన్షన్ మంజూరు చేయించి మళ్లీ వారికి పెన్షన్ అందించేవరకు సేవలన్నీ లబ్ధిదారుల ఇంటి వద్దకే అందేవి. కూటమి ప్రభుత్వ చర్యలతో జనమంతా పాత రోజులను గుర్తుకు తెచ్చుకుంటున్నారు.






జగన్ హయాంలో..

శ్రీకాకుళంలోని వృద్ధులకు వలంటీర్లు పింఛన్లు అందజేస్తున్న చిత్రాలివి. లబ్ధిదారుల ఇంటికే వెళ్లి పింఛన్లు ఇచ్చే సంప్రదాయానికి గత వైఎస్ జగన్ సర్కారు శ్రీకారం చుట్టింది. అప్పటివరకు లబ్ధిదారులు మండల కార్యాలయాలకు వెళ్లి గంటల తరబడి నిరీక్షించి పింఛన్లు తీసుకునేవారు. వైఎస్ జగన్ రూపకల్పన చేసిన వలంటీర్ల వ్యవస్థ ఈ అవస్థలను తప్పించింది. ఒకటో తేదీకి ఠంచనుగా వలంటీర్ల ద్వారా గత ప్రభుత్వం పింఛన్లు పంపిణీ చేయించింది. వైఎస్ జగన్ తీసుకువచ్చిన ఈ విప్లవాత్మక మార్పును ప్రస్తుత ప్రభుత్వం కూడా గత్యంతరం లేక ఫాలో అవుతోంది.

నిరంకుశత్వానికి నిదర్శనాలు..

- ఆమదాలవలస మండలం కణుగులవలస గ్రామానికి చెందిన అంధుడు సీపాన ఆనందరావు వైఎస్సార్‌సీపీకి ఓటు వేశారని ఆయన పెన్షన్ ఆపేశారు. కోర్టును ఆశ్రయించినా ఫలితం లేదు.
- ఆమదాలవలస నియోజకవర్గం బూర్జ మండలం కొరగాం పంచాయతీ పరిధిలో కటకమయ్యపేట గ్రామానికి చెందిన ఇద్దరు వితంతువులు కోరాడ తవిటమ్మ, గుజ్జు లక్ష్మిలు తమ భర్తలు వృద్ధాప్య పింఛన్ తీసుకుంటూ మృతి చెందారని స్పౌజ్ కోటాలో పెన్షన్ మంజూరు చేయాలని విన్నవించుకున్నారు. కానీ గత ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి ఓట్లు వేశారనే సాకుతో స్థానిక ఎమ్మెల్యే వారికి పెన్షన్ రాకుండా అడ్డుకుంటున్నారు.



లెక్కలివే..

- వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో జిల్లా వ్యాప్తంగా **3,15,328** మందికి పింఛన్లు అందజేసేవారు.
- కూటమి అధికారంలోకి వచ్చిన ఏడాది తర్వాత ఆ సంఖ్య **3,08,684**కు పడిపోయింది.
- జిల్లా వ్యాప్తంగా దాదాపు **1200** మంది లబ్ధిదారులను రాజకీయ కక్షలకు బలి చేశారు.
- వృద్ధాప్య పింఛన్ తీసుకుంటూ మృతి చెందిన వారిలో స్పౌజ్ కోటాకు అర్హులైన వారు **2800** ఉండగా ఇప్పటికవరకు స్పౌజ్ కోటాలో జిల్లా వ్యాప్తంగా సుమారుగా **1900** మందికి మాత్రమే పెన్షన్‌లు మంజూరు చేశారు. నిబంధనల పేరిట కొందరికి, రాజకీయ కక్షల పేరిట మరికొందరికి పెన్షన్ దూరం చేశారు.

కొత్త పెన్షన్లు ఎప్పుడిస్తారు



ప్రజలను మోసం చేస్తూ ఇంకెన్నాళ్లు పబ్బం గడుపుతారు. కక్ష సాధింపులతోనే కాలం గడుపుతున్నారు. పేదలకు ఆర్థిక భరోసా లేకుండా పోయింది. జిల్లాలో చాలామంది 60 ఏళ్లు దాటిన వారు పింఛన్ల కోసం ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే 12 నెలలకు ఒక్కో లబ్ధిదారుడు రూ. 48 వేలు కోల్పోయారు. ఇదేం పాలన బాబూ.

– కొప్పల ఈశ్వరరావు, వైఎస్సార్ సీపీ మేధావుల సంఘం జిల్లా అధ్యక్షుడు

కొత్త పెన్షన్ కోసం ఎదురుచూపు



నాకు ఆధార్ కార్డు ప్రకారం 62 ఏళ్లు వచ్చాయి. గత ఏడాదికాలంగా పింఛన్ కోసం దరఖాస్తు చేసుకోవాలని చూస్తున్నాను. చాలా చార్లు సచివాలయానికి వెళ్లాను. ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలేవీ రాలేదని చెబుతున్నారు

– పిట్ట అప్పన్న, కాలపర్తి, బూర్జ మండలం

కక్ష కట్టారు..



నా భర్త కోరాడ గోపాలరావు పెన్షన్ తీసుకుంటూ మృతిచెంది ఏడాది కాలమైంది. పెన్షన్ కోసం నేను సచివాలయంలో దరఖాస్తు చేసుకున్నాను. వెంటనే మంజూరు చేశారు. జాబితాలో పేరు కూడా వచ్చింది. కానీ గ్రామ రాజకీయాల్లో భాగంగా నాకు ఇప్పటివరకు పెన్షన్ ఇవ్వలేదు. ఎంపీడీఓ కార్యాలయానికి వెళ్లి అడిగితే.. మీ పెన్షన్‌ను ఎమ్మెల్యే నిలుపుదల చేయమన్నారని చెప్పారు. వైఎస్సార్ సీపీకి ఓట్లు వేశామని నిలుపుదల చేశారు. ఇప్పటివరకు కలెక్టర్ గ్రీవెన్స్‌కు కూడా వెళ్తున్నా ఫలితం లేదు. నాలాంటివారు ఎందరో ఉన్నారు. వారికి న్యాయం చేయాలి.

– కోరాడ తవిటమ్మ, కటకమయ్యపేట, బూర్జ మండలం

పట్టించుకోవడం లేదు



నా భర్త రామారావు ఇటీవల మృతిచెందారు. గత ప్రభుత్వం హయాంలో పెన్షన్ తీసుకునే వారు. ఆయన చనిపోయాక నాకు పెన్షన్ ఇస్తారని పెద్దలు చెప్పారు. దీంతో నేను సచివాలయంలో దరఖాస్తు చేసుకున్నాను. వెంటనే మంజూరు చేశారు. కానీ దాన్ని ఆమదాలవలస ఎమ్మెల్యే అడ్డుకున్నారని అధికారులు చెబుతున్నారు. ఈ విషయమై కలెక్టర్ గ్రీవెన్స్‌కు వెళ్లాం. కలెక్టర్ ఎంపీడీఓకు ఆదేశాలు జారీ చేశారు. కానీ పింఛన్ మాత్రం ఇవ్వలేదు. మాలాంటి పేదల పొట్టలు కొడుతున్నారు.

– గుజ్జు లక్ష్మి, కటకమయ్యపేట, బూర్జ మండలం



సదరంలో దివ్యాంగుల అవస్థలు

స్కూల్ అసిస్టెంట్ పోస్టుల పదోన్నతులకు వేళాయె

- సీనియారిటీ జాబితా ప్రకారం అర్హులైన ఎస్‌జీటీల సర్టిఫికెట్ల పరిశీలన రేపు
- 73 పోస్టుల భర్తీకి పాఠశాల విద్యాశాఖ చర్యలు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలోని వివిధ మేనేజ్‌మెంట్లలో ఖాళీగా ఉన్న స్కూల్ అసిస్టెంట్ల(ఎస్‌ఏ) పోస్టులను అర్హులైన సెకెండరీ గ్రేడ్ టీచర్(ఎస్‌జీటీ)లతో భర్తీ చేసేందుకు పాఠశాల విద్యాశాఖ చర్యలు తీసుకుంది. ఇందుకు సంబంధించి సీనియారిటీ జాబితాలో ఉన్న ఎస్‌జీటీల సర్టిఫికెట్లను జూన్ రెండో తేదీన పరిశీలించేందుకు విద్యాశాఖ ఏర్పాట్లు చేసింది. జిల్లాలోని అన్ని జిల్లా పరిషత్, ప్రభుత్వ, మున్సిపల్, మున్సిపల్ కార్పొరేషన్ మేనేజ్‌మెంట్లలోని ఉన్నత పాఠశాలల్లో ఖాళీ (పదవీవిరమణ, మరణం, రీఅపోర్షన్ కారణంగా)గా ఉన్న స్కూల్ అసిస్టెంట్ల పోస్టులను అర్హత కలిగిన ఎస్‌జీటీలు, తత్సమాన కేటగిరిల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులతో భర్తీ చేసేలా పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నారు.

73 పోస్టుల భర్తీకి చర్యలు..


జిల్లాలో వివిధ మేనేజ్‌మెంట్లలో సబ్జెక్టుల వారీగా మొత్తం 73 స్కూల్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని వెల్లడించారు. వీటిలో జిల్లా పరిషత్ పరిధిలో అత్యధికంగా ఎస్‌ఏ పీఈ (ఫిజికల్ ఎడ్యుకేషన్) 33 పోస్టులు ఉండటం గమనార్హం. సంబంధిత సబ్జెక్టులలో సీనియారిటీ జాబితాను శ్రీకాకుళం డీఈఓ.ఓఆర్జీ అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. సీనియారిటీ జాబితాలో పేర్కొన్న అర్హత కలిగిన స్కూల్ అసిస్టెంట్లు, తత్సమాన కేటగిరీ ఉపాధ్యాయులు మాత్రమే జూన్ రెండో తేదీన ఉదయం 10.30 గంటలకు శ్రీకాకుళం ప్రభుత్వ(బాలుర) ఉన్నత పాఠశాల వేదికగా జరిగే సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేపట్టనున్నారు. సీనియారిటీ జాబితాలో ఉన్న ఎస్‌జీటీలు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతోపాటు సర్వీస్ రిజిస్టర్‌తో తమవెంట తీసుకురావాలని డీఈఓ డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య పేర్కొన్నారు.



జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం

కోవిడ్ అప్రమత్తతపై నిర్లక్ష్యం

- జిల్లాకు చేరని పరీక్ష కిట్లు
- అందుబాటులో లేని మందులు



శ్రీకాకుళం: కోవిడ్ అప్రమత్తతపై ప్రభుత్వ నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. జిల్లా కేంద్రంలోని సర్వజన ఆస్పత్రిలో పది పడకల వార్డును ఏర్పాటు చేసినప్పటికీ వ్యాధి లక్షణాలతో వచ్చిన వారిని పరీక్షించేందుకు కిట్లు లేవు. నాలుగేళ్ల కిందట తెప్పించి మిగిలిపోయిన కిట్లతో ప్రస్తుతం కోవిడ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. అప్పట్లో ఈ కిట్ల ద్వారా పరీక్షలు నిర్వహిస్తే వ్యాధి నిర్ధారణ కాదని, ఫలితాలు తప్పుగా వస్తున్నాయని పక్కన పడేశారు. ఇప్పుడు కిట్లు సరఫరా కాకపోవడంతో మరో గత్యంతరం లేక పాత కిట్లతోనే పరీక్షలు నిర్వహిస్తున్నారు. మందులు గానీ, మాస్కులు గానీ, నోడల్ బృందాలు గానీ ప్రత్యేక పారిశుద్ధ్య పనులు గానీ చేపట్టడం లేదు. ఇది ప్రమాదకమైన పరిస్థితులకు దారితీస్తుందని పలువురు అభిప్రాయ పడుతున్నారు. కోవిడ్ నిర్ధారణ పరీక్షలు మండల స్థాయిలో కాకుండా, జిల్లా స్థాయిలో నిర్వహించేందుకు ఏర్పాటు చేయటం విడ్డూరంగా ఉందని అంటున్నారు. ప్రస్తుత వేరియంట్ ప్రమాదకరం కాదంటూనే గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, దీర్ఘ కాలిక వ్యాధిగ్రస్తులకు ఈ వేరియంట్ వల్ల ప్రమాదం ఉండవచ్చని హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పరీక్ష కిట్లు, మందులు, మాస్కులు, శానిటైజర్లు జిల్లాకు, మండల కేంద్రాలకు పంపించేలా చర్యలు తీసుకోవాలని, ప్రజలను అవగాహన కలిగిస్తూ, అప్రమత్తం కలిగించాలని కోరుతున్నారు.

కిట్లు తెప్పిస్తున్నాం



జిల్లాకు ఒకటి, రెండు రోజుల్లో కోవిడ్ నిర్ధారణ పరీక్ష కిట్లు వస్తాయి. పాత కిట్లు సుమారు 2500 వరకు ఉన్నాయి. మాస్కులు, శానిటైజర్లు అందుబాటులో ఉన్నాయి. ప్రజలకు అవగాహన కలిగించేలా తగిన చర్యలు తీసుకున్నాం. గ్రామస్థాయిలో వైద్య సిబ్బంది వెళ్లి అప్రమత్తం చేస్తున్నారు.

– డాక్టర్ అనిత, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి, శ్రీకాకుళం

'ఖరీఫ్ సమీపిస్తున్నా సన్నద్ధత లేదు'

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ఖరీఫ్ సమీపించినా ఇంతవరకు విత్తనాలు, ఎరువులు సిద్ధం చేయలేదని, కూటమి ప్రభుత్వానికి ముందు చూపు లేదని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి, విజయనగరం పార్లమెంట్ పరిశీలకుడు కిల్లి వెంకట సత్యనారాయణ అన్నారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ముందస్తు నైరుతి రుతుపవనాలు వచ్చినా ఇప్పటివరకు సిద్ధం చేయలేదంటే పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చన్నారు. పెట్టుబడి సాయం ఎలాగూ ఇవ్వలేదు, కనీసం ఎరువులు, విత్తనాలు ముందస్తు ప్రణాళికతో సమకూర్చకపోతే ఎలా అని ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ హయాంలో ఏటా ముందస్తుగానే ఎరువులు, విత్తనాలు సిద్ధంగా ప్రతి రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉండేవన్నారు.

క్లుప్తంగా

మద్యానికి బానిసై వ్యక్తి మృతి

టెక్కలి రూరల్: జిల్లా ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో శనివారం సాయంత్రం ఓ వ్యక్తి మృతి చెందినట్లు స్థానికులు గుర్తించారు. అనంతరం టెక్కలి పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. కోటబొమ్మాళి మండలం హరిశ్చంద్రపురం పంచాయతీ శాలిపేట గ్రామానికి చెందిన చలపాక తారకేశ్వరరావు (39)గా గుర్తించినట్లు తెలిపారు. మద్యానికి బానిసై నిత్యం తాగుతూ ఉంటాడని, శరీరం డీహైడ్రేషన్‌కు గురై మృతి చెంది ఉంటాడని పోలీసులు తెలిపారు.

కారు బోల్తా.. తప్పిన ప్రాణాపాయం


బోల్తాపడిన కారు

టెక్కలి రూరల్: కోటబొమ్మాళి మండలం శ్రీపురం సమీపంలో జాతీయ రహదారిపై శనివారం ఓ కారు బోల్తాపడింది. ఒడిశాకు చెందిన ఏడుగురు వ్యక్తులు దైవ దర్శనానికి విశాఖపట్నం వెళ్లి తిరిగి వస్తుండగా శ్రీపురం సమీపంలో అదుపుతప్పి ఒక్కసారిగా బోల్తాపడింది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న వారికి ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు.

రూ.23,700 విలువైన కలప స్వాధీనం


విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్న కలప

ఎచ్చెర్ల: ప్రాంతీయ నిఘా అమలు అధికారి బి.ప్రసాదరావు ఆదేశాల మేరకు లావేరు మండలం బెజ్జిపురం జంక్షన్ వద్ద విజిలెన్స్, అటవీశాఖ అధికారులు శనివారం తనిఖీలు నిర్వహించారు. రణస్థలం మండలం చిల్లపేట గ్రామానికి చెందిన సిల్లా శంకరరావు అటవీశాఖ అనుమతులు లేకుండా బుడతవలస నుంచి చిల్లపేటకు అక్రమంగా తరలిస్తున్న రూ.23,700 విలువైన అకేషియా కలప దుంగలను పట్టుకున్నారు. అనంతరం బొలెరో వ్యాన్‌ను స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా కలపను తరలిస్తున్న వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ అధికారులు సీఐ సతీష్‌కుమార్, ఎస్సై రామారావు, సిబ్బంది ఈశ్వరరావు, కన్నబాబు, అటవీశాఖ అధికారులు, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ గౌరీశంకర్ పాల్గొన్నారు.

23 కేజీల గంజాయి సీజ్


సీజ్ చేసిన గంజాయిని చూపుతున్న అదనపు ఎస్పీ, సీఐ

నరసన్నపేట: మడపాం టోల్‌గేట్ వద్ద నిర్వహించిన తనిఖీల్లో ఇద్దరు వ్యక్తుల నుంచి 23 కేజీల 800 గ్రాముల గంజాయిని పోలీసులు సీజ్ చేశారు. ఈ ఘటనలో పర్లాకిమిడికి చెందిన ముక్తా పరిషా, కటక్‌కు చెందిన రత్నాకర్ జెన్నాలను అరెస్టు చేశారు. శనివారం నరసన్నపేట సర్కిల్ స్టేషన్‌లో అదనపు ఎస్పీ శ్రీనివాసరావు విలేకరులకు వివరాలు వెల్లడించారు. మడపాం టోల్‌గేట్ వద్ద శనివారం ఉదయం , మధ్యాహ్నం వేర్వేరుగా నరసన్నపేట పోలీసులు తనిఖీలు చేపట్టారు. ముక్తా పరిషా అనే మహిళ మూడేళ్ల బిడ్డతో 10 కేజీల గంజాయిని పర్లాకిమిడి నుంచి చెన్నైకి తరలిస్తుండగా పట్టుకున్నారు. ఆమెతో ఉన్న మరో వ్యక్తి పరారయ్యాడు. అలాగే కటక్ నుంచి హైదరాబాద్‌కు రత్నాకర్ అనే వ్యక్తి 13 కేజీల 800 గ్రాముల గంజాయిని తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. రాజేష్ అనే వ్యక్తి వద్ద గంజాయిని కొనుగోలు చేసి తరలిస్తున్నట్లు గుర్తించారు. ఈ రెండు కేసుల్లో మరింత దర్యాప్తు చేయాల్సి ఉందన్నారు. సమావేశంలో నరసన్నపేట సీఐ ఎం.శ్రీనివాసరావు, ఎస్ఐ సీహెచ్ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణ తప్పనిసరి

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): ద్విచక్ర వాహనం నడిపే ప్రతిఒక్కరూ విధిగా హెల్మెట్ ధరించాలని ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి, ఎఫ్ఏసీ న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.శ్రీధర్ అన్నారు. జిల్లా కేంద్రంలో శనివారం ట్రాఫిక్ నిబంధనలు, మోటారు యాక్ట్‌పై అవగాహన కల్పించారు. మైనర్లు వాహనాలు నడిపితే తల్లిదండ్రులే బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార కార్యదర్శి శ్రీధర్, ట్రాఫిక్ సీఐ వి.నాగరాజు, పారా లీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.

నదిలో జారిపడి వృద్ధుడి మృతి

శ్రీకాకుళం రూరల్: బైరి గ్రామానికి చెందిన గొర్లె రామారావు(70) శనివారం సాయంత్రం ఆరుబయటకు వెళ్లి వంశధార నది వద్ద ప్రమాదవశాత్తు జారిపడ్డాడు. ఎవరూ లేకపోవడంతో మునిగిపోయి చనిపోయాడు. విషయం తెలుసుకున్న రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇటీవల కాలంలో నదిలో ఇసుక తవ్వకాలు ఎక్కువగా జరిగాయని, ఆ గోతులే ప్రాణాలు బలిగొంటున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అమ్మో.. జూన్!





- సేద్యానికి, చదువులకూ ఒకేసారి ఖర్చులు
- రైతులు, సామాన్యులపై ఆర్థిక భారం
- గత ప్రభుత్వంలో ఆసరాగా నిలిచిన రైతుభరోసా, అమ్మఒడి పథకాలు


వ్యవసాయ పనుల్లో అన్నదాతలు

ఇచ్ఛాపురం రూరల్:

పిల్లలు బడి బాట.. పెద్దలు పొలంబాట పట్టే సమయం ఆసన్నమైంది. దీంతో అందరిలోనూ 'జూన్' గుబులు ప్రారంభమైంది. వ్యవసాయంలో పెట్టుబడులు ఎంత అవసరమో, పిల్లల చదువులకూ అంతకన్నా ఎక్కువే అవసరమవుతోంది. రెండింటికీ ఒకే సమయంలో ఖర్చు చేయాల్సిన పరిస్థితుల్లో సామాన్యులు ఇబ్బంది పడుతున్నారు. ఇదే సమయంలో వ్యవసాయంలో పెట్టుబడులు పెరగడం, చదువులకు సంబంధించిన ఫీజులు, ఇతర ఖర్చులు కూడా పెరిగి జూన్ ఎలా గట్టెక్కేదని ఆవేదన చెందుతున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రైతుభరోసా, అమ్మఒడి వంటి పథకాలు సకాలంలో అందడంతో ఆర్థిక ఇబ్బందులు గట్టెక్కేవి. ఇప్పుడా పరిస్థితి లేదు.

పెరిగిన సాగు ఖర్చులు..

జిల్లాలో మెజారిటీ ప్రజలు వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నారు. గతంలో ఎడ్లు నాగళ్లతో దుక్కి దున్నేవారు. ప్రస్తుతం 90 శాతానికి పైగా రైతులు ట్రాక్టర్లనే వినియోగిస్తున్నారు. దీంతో దుక్కి దున్నడం నుంచి విత్తనం వేసే వరకు ఖర్చు రెట్టింపవుతోంది. విత్తనాలు, ఎరువుల కొనుగోలుకు పెట్టుబడులు అవసరమవుతాయి. ఏ పంట వేయాలన్నా తొలినాళ్లలోనే ఎకరాకు తక్కువలో తక్కువ రూ.20 వేలు ఖర్చు చేయాల్సిందే. దీంతో పెట్టుబడుల కోసం నానా ఇబ్బందులు పడుతున్నారు అన్నదాతలు.

చదువులకు ఖర్చు ఎక్కువే..



జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో సుమారు 90 వేల మంది, గురుకుల పాఠశాలల్లో 10వేల మంది విద్యార్థులు చదువుతుండగా, 50 వేల మంది పైచిలుకు విద్యార్థులు ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్నారు. ఇతర ప్రాంతాల్లోని ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థల్లో మరో వేల 20వేల మంది వరకు చదువుతున్నట్లు అంచనా. ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాం, బ్యాగులు, షూస్ కోసం కనిష్టంగా రూ.10వేలు వరకు ఖర్చు చేయాల్సిందే. రూ.20వేల నుంచి రూ,50వేల వరకు ఫీజులు కోసం వెచ్చించాల్సిన పరిస్థితి. ఇద్దరు పిల్లలు ఉంటే రూ.50వేలకు పైబడి ఖర్చు ఉంటుంది. ఇక, ఇంటర్, డిగ్రీ, ఇంజనీరింగ్ చదివే విద్యార్థులు 65 వేల మంది ఉన్నారు. వీరంతా ఉన్నత విద్య కోసం రూ.లక్షల్లో ఖర్చు చేయాల్సి వస్తోంది.

అప్పులు చేయాల్సిందే..



ఏటా జూన్‌లో పంటల సాగు, పిల్లల చదువుల కోసం అప్పులు చేయాల్సిన పరిస్థితులు వచ్చేశాయి. ఏకకాలంలో రెండు రకాల ఖర్చులు భారంగా మారాయి. అవసరమైన సమయంలో బ్యాంకుల్లో రుణాలు లభించని పరిస్థితుల్లో వడ్డీ వ్యాపారుల వద్ద అప్పులు చేస్తున్నారు. ఎక్కువ వడ్డీలు కూడా పేద, మధ్య తరగతి వర్గాలకు ఇబ్బందికరంగా తయారవుతోంది. ఏది ఏమైనా జూన్ నెల గట్టెక్కడం సామాన్యుడికి సవాల్ అనే చెప్పాలి.

అందని పథకాల సొమ్ము..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో వివిధ పథకాల రూపంలో దాదాపు ప్రతి నెలా ఏదో ఒక రూపంలో ప్రజలకు డబ్బులు ఖాతాల్లో జమయ్యేవి. అవి స్కూల్, వ్యవసాయం, ఇతర ఖర్చులకు ఆసరాగా నిలిచేవి. అమ్మ ఒడి, విద్యా దీవెన, వసతి దీవెన, విదేశీ విద్యా దీవెన పథకాలతో ఠంఛనుగా చెప్పిన తేదీకే తల్లిదండ్రుల ఖాతాల్లో సొమ్ము జమా అయ్యేది. దీంతో పేద, మధ్య తరగతికి చెందిన ప్రజలు తమ పిల్లల్ని దర్జాగా చదివించేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పథకాలకు పంగనామాలు పెట్టేసింది. గత ప్రభుత్వం ఐదేళ్లలో అమ్మఒడి పేరిట రూ.1298.51 కోట్లు తల్లులు ఖాతాల్లో వేస్తే, కూటమి ప్రభుత్వం ఇప్పటి వరకు ఒక్క పైసా విదల్చలేదు. దీంతో 2.10 లక్షల మంది విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఉన్నత విద్య చదువుతున్న 65 వేల మంది విద్యార్థుల పరిస్థితి అయోమయంగా మారింది.

రైతన్నకు తిప్పలు..



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జిల్లాలోని రైతు భరోసా పథకం ద్వారా 18.19 లక్షల ఎకరాల భూమికి పెట్టుబడి సాయం, ప్రకృతి వైపరీత్యాలు జరిగినప్పుడు రైతులను ఆర్థికంగా ఆదుకునేందుకు డాక్టర్ వై.ఎస్.ఆర్ ఉచిత పంటల బీమా పథకంతో ఆదుకునేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 'అన్నదాత సుఖీభవ' పథకం కింద ప్రతీ ఏడాది రూ.20వేలు ఇస్తామంటూ ఎన్నికల వేళ చంద్రబాబు ఇచ్చిన హామీ ఇప్పటి వరకు నెరవేరలేదు. దీంతో ఏడాది నుంచి అన్నదాతలు అప్పులు చేసుకుంటూ పంటలు పండించుకుంటున్నారు. వ్యవసాయం కోసం తలకు మించి అప్పులు చేసి కొంత మంది అన్నదాతలు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు.

దగాపడ్డ రైతులు



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్నదాతలకు మొండిచేయి చూపింది. ప్రస్తుతం పంట సాగుకు అవసరమైన సొమ్ము రైతుల చేతిలో లేకపోవడంతో అప్పులు చేయాల్సి వస్తోంది. ప్రభుత్వ పరంగా రావాల్సిన పెట్టుబడి సాయం అందకపోవడం, విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేసేందుకు అవస్థలు తప్పడం లేదు. ఒక్క మాటలో చెప్పాలంటే కూటమి ప్రభుత్వంలో రైతులు దగాపడ్డారు.

– దుక్క ఆనంద్, రైతు సంఘ నాయకుడు, ఇచ్ఛాపురం

అప్పులు చేసి చదివిస్తున్నాం



జగనన్న ప్రభుత్వ హయాంలో ప్రతి ఏడాది పిల్లల చదువుకు సంబంధించి అమ్మ ఒడి పథకం ద్వారా నేరుగా మా ఖాతాలో జమ అయ్యేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అందరికీ తల్లికి వందనం పథకం ద్వారా సొమ్ము ఇస్తామన్నారు. నేటికి ఏడాది అవుతున్నా నయా పైసా కూడా ఇవ్వలేదు. రోజురోజుకు పెరుగుతున్న బడ్జెట్ కారణంగా పిల్లల్ని చదివించుకునేందుకు సగటు మధ్యతరగతి ప్రజలు అప్పులు చేయాల్సి వస్తోంది.

– దున్న జ్యోతి, బూర్జపాడు, ఇచ్ఛాపురం మండలం

'ఉపాధి'లో పైసా కూడా దుర్వినియోగం కాకూడదు

- రోడ్ల నిర్మాణాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి
- పీఆర్ శాఖ ఇంజినీర్ల పనితీరు మారాలి
- నరసన్నపేట పర్యటనలో పంచాయతీరాజ్ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్ కుమార్


బొరిగివలస రోడ్డు వద్ద పీఆర్ ఇంజినీర్లను ప్రశ్నిస్తున్న ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్‌కుమార్

నరసన్నపేట: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం నిధులు ఎక్కడా పైసా కూడా దుర్వినియోగం కాకూడదని, మెటీరియల్ కాంపొనెంట్ నిధులు మరింత బాధ్యతగా వినియోగించాలని పంచాయతీరాజ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్ కుమార్ స్పష్టం చేశారు. నరసన్నపేట మండలం బొరిగివలస, నరసన్నపేటలో శనివారం పర్యటించారు. మెటీరియల్ కాంపొనెంట్ నిధులతో నిర్మించిన రోడ్లు, ఉపాధి నిధులతో నిర్మించిన ఫారం పాండ్స్, సోప్ పిట్స్ పరిశీలించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌కు హాజరై జిల్లాలో జరుగుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాల ఫొటోలను తిలకించారు. బొరిగివలస వద్ద ఎన్ఆర్ఈజీఎస్ మెటీరియల్ కాంపొనెంట్ నిధులు రూ.50 లక్షలతో నిర్మించిన రోడ్డును పరిశీలించారు. రోడ్డు పక్కల వేసిన బెర్ములు నాణ్యతగా లేకపోవడాన్ని గమనించి పీఆర్ ఇంజనీర్లను ప్రశ్నించారు. గ్రావెల్‌కు బదులు మట్టి వేస్తున్నారని , రోడ్డు వేసిన తరువాత బెర్ములు నాణ్యతగా ఉంటేనే పది కాలాలు ఉంటుందని చెప్పారు. ఇలాగే పనులు చేస్తున్నారా.. అంటూ మండి పడ్డారు. బిల్లులు చెల్లించాలని కాంట్రాక్టర్లు ఒత్తిడి తీసుకొస్తున్నారని పీఆర్ ఇంజనీర్లు వెనకేసుకురావడాన్ని ఆయన తప్పుపట్టారు. అనంతరం బొరిగివలసలో ఫారం పాండ్స్‌ను పరిశీలించి రైతు పొన్నాడ ప్రసాద్‌కు పలు సూచనలు చేశారు. పంచాయతీ కార్యాలయం సమీపంలో మంచినీటి బోరు వెల్ వద్ద సోప్‌పిట్ నిర్మాణం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధి వేతనాలు త్వరలోనే విడుదలవుతాయని చెప్పారు. కార్యక్రమంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ఆర్డీఓ సాయి ప్రత్యూష, పీడీ బి.సుధాకర్, జెడ్పీ సీఈఓ శ్రీధర్ రాజా, పలువురు ఇంజనీర్లు, అధికారులు పాల్గొన్నారు.

ఆదివారమైనా బాధ్యతలు స్వీకరించాల్సిందే

- హెచ్‌ఎంలుగా పదోన్నతి పొందినవారు నేడు విధుల్లో చేరిక


ఇటీవల హెచ్‌ఎంల పదోన్నతి కౌన్సెలింగ్‌లో పాల్గొన్న ఉపాధ్యాయులు

శ్రీకాకుళం న్యూకాలనీ: పాఠశాల విద్యాశాఖలో ఇటీవల హెచ్‌ఎంలుగా పదోన్నతి పొందిన ఉపాధ్యాయులు ఆదివారం విధుల్లో చేరనున్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, మున్సిపల్, మున్సిపల్ కార్పొరేషన్ మేనేజ్‌మెంట్లలో ఇటీవల 83 మంది స్కూల్ అసిస్టెంట్లు, తత్సమాన కేటగిరి ఉపాధ్యాయులు ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతి పొందిన విషయం తెలిసిందే. వీరికి గత నెల 29న శ్రీకాకుళం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల వేదికగా పదోన్నతి కౌన్సెలింగ్ నిర్వహించారు. పాఠశాల విద్యాశాఖ అధికారిక వెబ్‌సైట్లో సాంకేతిక సమస్యల కారణంగా ఆరోజు ఉదయం 10 గంటలకు మొదలువకావాల్సిన ఆన్‌లైన్ కౌన్సెలింగ్ సాయంత్రం 6 నుంచి రాత్రి 9.30 వరకు మాన్యువల్ విధానంలో పూర్తిచేసిన ఉదంతం విదితమే. కాగా ఆరోజు హెచ్‌ఎంలగా పదోన్నతి పొందిన వారంతా ఎంపిక చేసుకున్న పాఠశాలల్లో ఆదివారం ఉదయం బాధ్యతలు స్వీకరించి, విధుల్లో చేరాల్సిందేనని ప్రభుత్వం ఉత్తర్వుల్లో స్పష్టంచేసింది. ఈ 83 మందిలో జిల్లా పరిషత్ మేనేజ్‌మెంట్‌లో 80మంది, మున్సిపల్ ఇద్దరు, మున్సిపల్ కార్పొరేషన్‌లో ఒకరు ఉన్నారు. వీరంతా శనివారం పాత పాఠశాలల నుంచి రిలీవ్ అయ్యారని డీఈఓ తిరుమల చైతన్య పేర్కొన్నారు.

విభాగాల సమన్వయంతోనే ఉత్తమ ఫలితాలు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ప్రస్తుతం జిల్లాల మధ్య సహకారం మాత్రమే కాకుండా, అభివృద్ధిలో ఆరోగ్యకరమైన పోటీ కూడా పెరిగిందని శ్రీకాకుళం జిల్లా ప్రత్యేకాధికారి, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్ కుమార్ అన్నారు. శుక్రవారం జిల్లా అధికారులతో కలెక్టర్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విభాగాల సమన్వయంతో ఉత్తమ ఫలితాలు సాధించవచ్చన్నారు. తలసరి ఆదాయం, జీడీపీ వృద్ధి వంటి కీలక సూచికలలో శ్రీకాకుళం జిల్లా గణనీయంగా పురోగమిస్తోందని వెల్లడించారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వ్యవసాయ రంగాన్ని మరింత ప్రోత్సహించేందుకు పంట వైవిధ్యాన్ని, డ్రోన్ సాంకేతికతను వినియోగిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలోజేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు, ఆర్డీవోలు సాయి ప్రత్యూష, కృష్ణమూర్తి, వెంకటేష్, డీఆర్‌డీఏ పీడీ కిరణ్ కుమార్, సీపీఓ లక్ష్మీప్రసన్న, ఐసీడీఎస్ పీడీ శాంతిశ్రీ, డీఎంహెచ్ఓ అనిత, డీటీసీ విజయసారథి, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

5న ప్రభుత్వ ఉద్యోగుల మహాసభలు


మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

శ్రీకాకుళం అర్బన్: ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం మూడో రాష్ట్ర కౌన్సిల్ మహాసభలు ఈ నెల 5న జరగనున్నాయని, ఈ సభలకు జిల్లా నుంచి అధిక సంఖ్యలో ఉద్యోగులు తరలిరావాలని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా ప్రతినిధులు పిలుపునిచ్చారు. శ్రీకాకుళంలోని క్లాత్ మర్చంట్ అసోసియేషన్ కార్యాలయంలో శనివారం సంఘ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. 12వ పీఆర్‌సీ కమిషన్ వేయాలని, మధ్యంతర భృతి వెంటనే ప్రకటించాలని, పెండింగ్ పీఆర్‌సీ, డీఏ, ఎస్ఎల్ఎస్, ఏపీజీఎల్ఐ చెల్లింపులు కోసం, సీపీఎస్/జీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ పునరుద్ధరణకు ఉద్యోగ సంఘాలతో చర్చలు జరపాలని, 1వ తేదీన జీతాలు/పెన్షన్లు చెల్లింపు చట్టబద్ధం చేయాలని, ఎన్ఎంఆర్ కంటింజెంట్ / కాంట్రాక్టు / ఔట్ సోర్సింగు ఉద్యోగుల రెగ్యులరైజేషన్ తదితర 14 ప్రధాన డిమాండ్లను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లనున్నట్లు సభ్యులు తెలిపారు. అనంతరం మహాసభల పోస్టర్‌ను ఉద్యోగులు ఆవిష్కరించారు. సమావేశంలో ప్రెసిడెంట్ ఎస్.సోమేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సంతోష్ కుమార్, స్టేట్ కార్యదర్శి జి.తిరుపతి రావు, సంఘ ప్రతినిధులు ఇప్పిలి నారాయణరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ పైల రవి, టౌన్ బోడి ప్రెసిడెంట్ పి.నాగేశ్వరరావు, టౌన్ సెక్రటరీ సూర్య చంద్ర, కె.రాజేశ్వరరావు, వి.శరథబాబు, అప్పలనాయుడు, రాష్ట్ర జనరల్ సెక్రటరీ తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు ఇద్దరు మృతి


సింహాచలం (ఫైల్)


అప్పలనాయుడు(ఫైల్)

కొత్తూరు/సరుబుజ్జిలి: జిల్లాలో వేర్వేరు చోట్ల పిడుగుపాటుకు గురై ఇద్దరు మృత్యువాతపడ్డారు. కొత్తూరు మండలం ఆకులతంపర కాలనీకి చెందిన పెయ్యల సింహాచలం(79) శనివారం కాలనీ సమీపంలో ఉన్న పొలాల్లోకి మేకలను మేతకు తీసుకెళ్లాడు. ఇంతలో వర్షం కురవడంతో చింతచెట్టు కిందకు చేరుకున్నాడు. ఇంతలో పిడుగు పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు సర్పంచ్ నాగళ్ల అప్పన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఎండీ అమీర్ ఆలీ కేసు నమోదు చేశారు. సింహాచలంకు భార్య పున్నమ్మ, వివాహమైన ఇద్దరు పిల్లలు ఉన్నారు. అదే విధంగా, సరుబుజ్జిలి మండలం బుడ్డివలసకు చెందిన బూరాడ అప్పలనాయుడు(54) పొలం పనులకు వెళ్లగా పిడుగుపాటుకు కుప్పకూలిపోయాడు. స్థానికులు స్పందించి పీహెచ్‌సీకి తరలించగా అప్పటికే మృతిచెందాడు. అప్పలనాయుడుకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

కానిస్టేబుల్‌పై దాడికి పాల్పడిన ఇద్దరికి జైలు

శ్రీకాకుళం క్రైమ్ : ఇటీవల జిల్లాకేంద్రంలోని లెప్రసీ కాలనీ వద్ద విధులు ముగించుకుని ఇంటికి వెళ్తున్న జిల్లా క్రైమ్ రికార్డ్ బ్యూరో హెడ్‌కానిస్టేబుల్‌పై కొందరు యువకులు దాడికి పాల్పడిన సంగతి తెలిసిందే. దాడికి పాల్పడిన ఇద్దరికి శ్రీకాకుళం సెకెండ్ క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ 20 రోజులు జైలు శిక్ష విధించినట్లు ఒకటో పట్టణ సీఐ సీహెచ్ పైడపు నాయుడు శుక్రవారం తెలిపారు. మే 29న రాత్రి 7.20 గంటలకు తన ద్విచక్ర వాహనంపై లెప్రసీ కాలనీ జంక్షన్‌కు హెచ్‌సీ పొన్నాడ త్రినాధరావు చేరుకున్న సమయంలో బోడెమ్మకోవెల వీధికి చెందిన వెల్లంపూడి రాజేష్, దమ్మలవీధికి చెందిన పొట్నూరు వాసు బహిరంగ ప్రదేశంలో మద్యం సేవిస్తూ అసభ్యకరంగా ప్రవరించారు. దీనిపై ప్రశ్నించిన హెచ్‌సీపై మద్యం మత్తులో దాడి చేయడంతో గాయాలయ్యాయి. సమాచారమందుకున్న ఒకటో పట్టణ ఎస్ఐ-2 బి.రామారావు ఘటనా స్థలికి చేరి యువకులను అదుపులోకి తీసుకుని డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ చేయగా మద్యం సేవించినట్లు నిర్ధారణ అయ్యింది. దీనిపై శుక్రవారం శుక్రవారం మెజిస్ట్రేట్ శివరామకృష్ణ ఒక్కొక్కరికీ 20 రోజుల జైలు శిక్ష విధించగా జిల్లా జైలుకు తరలించారు.

సంబరాలకు వేళాయె..!

- కంచిలిలో నేటి నుంచి కంచమ్మతల్లి ఉత్సవాలు
- తొమ్మిది రోజులపాటు నిర్వహణ
- భారీ విద్యుత్ అలంకరణలతో ముస్తాబు


సిద్ధమైన కంచమ్మతల్లి ఆలయం (ఇన్‌సెట్లో) కంచమ్మతల్లి అమ్మవారు


ఈఫిల్ టవర్ నమూనా

కంచిలి : మండల కేంద్రం కంచిలిలో కొలువై ఉన్న కంచమ్మతల్లి అమ్మవారి ఉత్సవాలు ఆదివారం రాత్రి నుంచి ప్రారంభం కానున్నాయి. తొమ్మిది రోజులపాటు ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ నెల 10వ తేదీ వరకు జరిగే ఈ ఉత్సవాలకు ఆరు నెలల నుంచి ఏర్పాట్లు చేస్తున్నారు. ఎప్పటికప్పుడు గ్రామస్తులు సమావేశమై ఏర్పాట్లను పర్యవేక్షిస్తూ, అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు. భారీ స్థాయిలో విద్యుత అలంకరణ చేపట్టారు. పది రోజులపాటు పురవీధుల్లో అమ్మవారిని ఊరేగించనున్నారు. 2015లో చివరి సారిగా గ్రామ దేవత ఉత్సవాలు నిర్వహించారు. మళ్లీ పదేళ్ల తర్వాత జరుగుతుండటంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాట్లు చేశారు. ఆదివారం రాత్రి అమ్మవారిని గ్రామంలోకి ఆహ్వానం పలకడానికి సర్వం సిద్ధం చేశారు.

నమూనా విగ్రహం ఏర్పాటు..

భక్తుల దర్శనార్థమై అమ్మవారికి వజ్రవైడూర్యాలు, బంగారు ముత్యాలహారం, బంగారు జడపాళి, వెండి మకరతోరణం, వెండి కవచం, బంగారు అభయహస్తం తదితర ఆభరణాలను అమ్మవారి నమూనా విగ్రహానికి అలంకరించారు. ఈ విగ్రహాన్ని స్థానిక రైల్వేస్టేషన్ కూడలి వద్ద పీఠస్థానసమీపంలో మెయిన్‌రోడ్డు పక్కన ఏర్పాటు చేస్తున్నారు.

సాంస్కృతిక కార్యక్రమాలివే..

అమ్మవారి ఊరేగింపుతోపాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను కూడా నిర్వహించనున్నారు. ఒకటో తేదీ రాత్రి అమ్మవారిని కాళికాదేవి నృత్యనాట్య ప్రదర్శనలతో ఆర్భాటంగా ఆహ్వానించనున్నారు. 2వ తేదీ నుంచి 10వ తేదీ వరకు ప్రతిరోజు సాయంత్రం అమ్మవారి ఆభరణాలు పెట్టెను మేళతాళాలతో ఊరేగింపుగా పీఠస్థానం వద్దకు తీసుకొస్తారు. ప్రతిరోజు సాయంత్రం 5 గంటలకు అమ్మవారి ఊరగింపుతోపాటు గ్రామదేవతలు, గ్రూపు డ్యాన్స్‌లు, కోలాటం, పాలబొమ్మలు, తీన్మార్, చైనా కోబ్రా తదితర కార్యక్రమాలు ప్రదర్శించనున్నారు. ప్రతి రోజు రాత్రి 8 గంటల నుంచి కంచిలి జూనియర్ కళాశాల మైదానంలో వివిధ స్టేజి ప్రోగ్రామ్‌లు నిర్వహించనున్నారు.